# శాంతి

# SANTI

విశ్వమానవ సాభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

February / ఫిబ్రవరి -2026



ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయోభవేత్

ఏకం సత్ విప్రా బహుధా వదంతి
ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.
- ఋగ్వేద సంహిత

# శాంతి
# SANTI


విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక

స్థాపకులు : పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహరాజ్

సంపాదకులు : స్వామిని వినమ్రానంద

VoL./ సంపుటి : 101 February / ఫిబ్రవరి -2026 No./ సంచిక : 2


| వ.నెం. | విషయసూచిక | పేజి నెం. |
|---|---|---|
| 1. | ప్రార్థన | 2 |
| 2. | ధ్యానము | 3 |
| 3. | పూజ్యశ్రీ జ్ఞానేశ్వరీ మాతాజీ | 4 |
| 4. | దివ్య తేజము అనంత తెజములో లీనమైనది - వినమ్రానంద | 5 |
| 5. | శ్రీ ఓంకార్ ఆత్మకథ | 6 |
| 6. | శాంతిప్రార్థన | 10 |
| 7. | ఆనందరామాయణము | 13 |
| 8. | హృదయస్పందన | 18 |
| 9. | ఏకజీవ వాదము - దృష్టి-సృష్టి వాదము | 19 |
| 10. | వార్తలు - కార్యక్రమములు | 25 |
| 9. | విరాళములు | 27 |


ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులుకాని, సంపాదకులు కారు.

జీవిత సభ్యత్వం రూ. 1000/- లు సాలుసరి రూ. 100/-




# ప్రార్థన
## విష్ణుపంజరస్తోత్రము

**శ్లో॥ ప్రవక్ష్యామ్యధునా హ్యేతద్వైష్ణవం-పఞ్జరం శుభమ్ ।**
**నమో నమస్తే గోవింద చక్రం గృహ్య సుదర్శనమ్ ॥**
**ప్రాచ్యాం రక్షస్వ మాం విష్ణో త్వామహం శరణం గతః ॥1॥**

**తా॥** శుభప్రదమైన విష్ణువు యొక్క రక్షణకవచమును (పంజరము) నేను యిపుడు చెబుతాను. ఓ గోవిందా! నీకు మరల మరల నమస్కారములు. సుదర్శన చక్రమును తీసికొని తూర్పునందు నన్ను రక్షించగలవు (కాపాడగలవు). ఓ విష్ణూ! నీవే నాకు రక్షకుడవు. నిన్నే శరణు పొందుతున్నాను.

**శ్లో॥ గదాం కౌమోదకీం గృహ్య పద్మనాభ నమోஉస్తుతే ।**
**యామ్యాం రక్షస్వ మాం విష్ణో త్వామహం శరణం గతః ॥2॥**

**తా॥** ఓ పద్మనాభా! నీకు నమస్కారం. కౌమోదకీ అను గదను గ్రహించు. ఓ విష్ణూ! దక్షిణదిక్కునందు రక్షించు. నీవే నాకు శరణు.

**శ్లో॥ హలమాదాయ సౌనన్దం నమస్తే పురుషోత్తమ ।**
**ప్రతీచ్యాం రక్షమాం విష్ణో! త్వామహం శరణం గతః ॥3॥**

**తా॥** సౌనందం అను పేరుగల నాగలి తీసికొని, నన్ను తూర్పుదిక్కున కాపాడు. ఓ పురుషులలో శ్రేష్ఠమైనవాడా! నీవే నాకు రక్షకుడవు. నిన్నే శరణు వేడుతున్నాను.

**శ్లో॥ ముసలం శాతనం గృహ్య పుణ్డరీకాక్ష రక్షమామ్ ।**
**ఉత్తరస్యాం జగన్నాథ భవస్తం శరణం గతః ॥4॥**

**తా॥** ఓ తామరపువ్వు వంటి కన్నులు కలవాడా! శాతనం అను పేరుగల రోకలిని తీసికొని, ఉత్తరదిక్కున నన్ను రక్షించు నీవే నాకు శరణు. నీవే రక్షకుడవు (కాపాడువాడవు).

**శ్లో॥ ఖడ్గమాదాయ చర్మాథ అస్త్రశస్త్రాదికం హరే ।**
**నమస్తే రక్ష రక్షోఘ్న ఐశాన్యాం శరణం గతః ॥5॥**

**తా॥** ఖడ్గమును, తోలు తొడుగును తీసుకొని ఇతర ఆయుధాలు, బాణాలు తీసికొని ఈశాన్యదిక్కునందు నన్ను రక్షించుము. నీవే నాకు రక్షకుడవు (కాపాడు వాడవు). నిన్నే శరణు పొందాను.

**శ్లో॥ పాఞ్చజన్యం మహాశఙ్ఖమనుద్బోధఞ్చ పఙ్కజమ్ ।**
**ప్రగృహ్య రక్షమాం విష్ణో ఆగ్నేయ్యాం రక్ష సూకర ॥6॥**

**తా॥** పాంచజన్యమను పేరుగల శంఖవిశేషంతో, వికసించిన పద్మంతోను ఆగ్నేయదిక్కునందు ఓ వరాహరూపా నన్ను రక్షించు. ఓ విష్ణు! నన్ను కాపాడుము.

శ్లో॥ చంద్రసూర్యం సమాగృహ్య ఖడ్గం చాంద్రమసం తథా ।
నైఋత్యాం మాఇ్చ రక్షస్వ దివ్యమూర్తే నృకేశరిన్ ॥7॥

తా॥ సూర్యచంద్రులను, చాంద్రమస ఖడ్గమును తీసికొని (ధరించి), నన్ను నైఋతిమూలనందు రక్షించు. ఓ పవిత్రమూర్తీ! ఓ నరసింహావతారా! నన్ను కాపాడు.

శ్లో॥ వైజయన్తీం సమ్ప్రగృహ్య శ్రీవత్సం కణ్ఠభూషణమ్ ।
వాయవ్యాం రక్షమాం దేవ హయగ్రీవ నమోఽస్తుతే ॥8॥

తా॥ కంఠమునకు అలంకారమైన వైజయన్తీమాలను, శ్రీవత్సం అను గుర్తును గ్రహించి, వాయువ్యదిక్కునందు ఓ హయగ్రీవా! (గుఱ్ఱము మెడ వంటి మెడకలవాడు!) ఓ ప్రభూ నీకు నమస్కారం.

శ్లో॥ వైనతేయం సమారుహ్య త్వన్తరీక్షే జనార్దన ।
మాఇ్చ రక్షాజిత సదా నమస్తేఽస్త్వపరాజిత ॥9॥

తా॥ గరుత్మంతునిపై ఎక్కి, ఆకాశంలో వెళ్ళు ఓ జనార్దన ఎల్లపుడు నన్ను రక్షింపుము. పరాజయంలేని ఓ స్వామీ! నీకు నమస్కారం.

శ్లో॥ విశాలాక్షం సమారుహ్య రక్షమాం త్వం రసాతలే ।
అకూపార నమస్తుభ్యం మహామీన నమోఽస్తుతే ॥10॥

తా॥ విశాలాక్షి యందు స్వారీ చేస్తూ రసాతలమునందు నన్ను రక్షించు. ఒడ్డులేని సముద్రం వంటి వాడా! ఓ మత్స్యావతారమా! నీకు నమస్కారం.

శ్లో॥ కరశీర్షాద్యఙ్గులేషు సత్య త్వం బాహుఞ్జరమ్ ।
కృత్వా రక్షస్వ మాం విష్ణో నమస్తే పురుషోత్తమ ॥11॥

తా॥ఓ నిజస్వరూపా! నీ యొక్క బాహుపంజరం అనగా భుజాలతో రక్షణ కవచం చేసి, నాయొక్క చేతులు, వ్రేళ్ళు, తల మరియు ఇతర భాగాలను కాపాడు ఓ మానవశ్రేష్ఠా! విష్ణూ! నీకు నమస్కారం.

శ్లో॥ ఏవముక్తం శఙ్కరాయ వైష్ణవం పఞ్జరం మహత్ ।
పురా రక్షార్థమీశాన్యాః కాత్యాయన్యా వృషధ్వజ ॥12॥

తా॥ ఈ విధంగా శంకరనికి వైష్ణవపంజరమును, మహత్తును ముందుగా తెలిపి, శంకరుని భార్య పార్వతీ (కాత్యాయినీ) దేవిని రక్షించాడు.

## ధ్యానము

నాంతః ప్రజ్ఞం న బహిష్ప్రజ్ఞం నోభయతః ప్రజ్ఞం న ప్రజ్ఞానఘనం
న ప్రజ్ఞం నాప్రజ్ఞమ్ అదృష్టమవ్యవహార్యమగ్రాహ్యమలక్షణ

తా॥ ప్రాజ్ఞుడు బీజము, విశ్వ తైజసులు అంకురములు అనే మాయిక కార్య కారణ భావము.





ఓం నమో నారాయణాయ

జననం : 13-10-1931 - దివ్యసన్నిధి : 26-12-2025

పరమ ప్రేమమూర్తి, పరమ ప్రేమ స్వరూపిణీ, శాంతికి నిలయము అయిన పూజ్యశ్రీ **జ్ఞానేశ్వరీ మాతాజీ** శ్రీ శాంతి ఆశ్రమ అధ్యక్షులుగా అందరికీ తెలిసిన విషయమే. పరమయోగి ఓంకార్ స్వామి వారికి ప్రియశిష్యులు మరియు స్వామివారి ప్రేమకు పాత్రురాలై దేశ విదేశాలలోనే కాక మారుమూల కుగ్రామం వరకు అందరి హృదయాలలో శాంతి సామరస్యాలను నెలకొల్పినటువంటి మహాయోగిని ది. **26-12-2025** రోజున ఉదయం గం॥ **6.40** ని॥లకు గురు సన్నిధికి చేరుకున్నారు. వారి దివ్య భౌతిక కాయమును ది. **27-12-2025** శనివారం రోజున ఉదయం గం॥ 10.30 ని॥లకు ప్రాంగణములో మహాసమాధి చేయబడెను.

శాంతి ఆశ్రమ నిర్వాహకులు

# దివ్య తేజము అనంత తేజములో లీనమైనది

## పరమ పూజ్య శ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ

పూజ్య శ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ 9 సంవత్సరముల వయస్సులో పూజ్య ఓంకార స్వామీజీ వారి చరణములకు తనను తాను సమర్పణ చేసుకున్నారు. శబరిమాత ఏరకంగా మతంగ మహర్షి ఆశ్రమములో తన సర్వస్వాన్ని అంకితం చేసారో ఆ విధంగా పూజ్య జ్ఞానేశ్వరి మాతాజీ ఓంకార స్వామి వారి అడుగు జాడలలో భక్తితో నిరంతరాయముగా గురు సేవను చేసిన ధన్య జీవి. వారి గురించి చెప్పాలి అంటే అనంత ఆకాశాన్ని కొలవడానికి ప్రయత్నించినట్లు. అయినప్పటికీ కూడానూ ఉడతా భక్తి వలె మా అల్ప సామర్థ్య ము తో వారి గురించి తెలియజేయుటకు సాహసిస్తున్నాము. పూజ్య ఓంకార స్వామీజీ వారు దైవసాయుజ్యం పొందిన నాటి (10-6-1982) నుండి చివరివరకు ఆశ్రమ సేవలలో స్వామీజీ ఉపదేశమును తుచతప్పకుండా పాటిస్తూ ఆశ్రమ శాఖలన్నింట్లో కూడానూ విశేషమైన సేవలను, నిరంతర ప్రేమను, విద్యను అందిస్తూ స్వామీజీ వారు ఉపదేశించిన నామజపం, ధ్యాన సాధనలో నిమగ్నమవుతూ సర్వస్వమును సమాజ శ్రేయస్సుకు అంకితము చేసిన మహనీయురాలు. శబరిమాత ఎలాగైతే విజ్ఞానమనే ఫలములను రాములవారికి అర్పణ చేసి, రాములవారిలో ఐక్యమయ్యారో ఆ విధంగా గురుసేవ చేస్తూ జ్ఞానమనే ఫలాన్ని స్వామీజీ వారికి అర్పించి అనంత తెజములో లీనమయ్యారు. వారు భౌతికముగా లేకపోవడము ఆశ్రమానికి చాలా తీరనిలోటు. కానీ వారు భౌతికముగా లేకపోయినప్పటికీ ఎప్పుడూ వారి శక్తి అందరిద్వారా ప్రసరించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాము. వారు ఎప్పుడూ ఓంకారము, శాంతి ప్రార్థన చెప్పేవారు. చివరి శ్వాసలో కూడా ఓంకారం, శాంతి ప్రార్థన చెబుతూ దైవ సాయుజ్యం పొందారు.

పూజ్య మాతాజీ వారి గురుచరణములకు సాష్టాంగ ప్రణామములు తప్ప వేరేమియు సమర్పించలేము.

ఇట్లు

గురుసేవలో

**వినమ్రానంద**



# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామిజీ ఆత్మకథ

*మూలం* : **స్వామిఓంకార్** *అనువాదం* : **బొప్పన అరుణాదేవి**

(గత సంచిక తరువాయి) **అధ్యాయం - 67**

## కుమారి జ్ఞానేశ్వరి

**ఇతరులు**

“భగవాన్! నన్ను నేను మర్చిపోయి ప్రతిదినము ఇతరుల కోసం జీవించే విధంగా నాకు సహాయము చేయి. నేను మోకాళ్ళపై వంగి ప్రార్థన చేసేటప్పుడు కూడా ఆ ప్రార్థన ఇతరుల కోసం చేసేవిధంగా చూడు. నేను నా పనిని నిజాయితీగా, యథార్థంగా చేయడానికి నీవు సహకరించు. నేను నీకోసం ఏదయితే చేస్తున్నానో అది ఇతరుల కోసం చేయాలని నాకు అర్థం అయ్యేవిధంగా చూడు. ‘నేను’ అనే అహంభావనని నిర్దాక్షిణ్యంగా కనిపించకుండా లోతుగా పూడ్చి పెట్టివేయి. అలా చేయకపోతే ఇతరుల కోసమే జీవించడానికి నేను చేసే ప్రయత్నాలు అన్నీ వ్యర్థం అయిపోతాయి. ఈ భూమి మీద నేను పనిచేస్తున్నప్పుడూ, స్వర్గంలో నా పని మొదలుపెట్టేటప్పుడు కూడా నేను ధరించిన కీర్తి కిరీటాన్ని మర్చిపోయేలా నన్ను అనుగ్రహించు. నన్ను ఎల్లప్పుడూ ఇతరుల గురించే ఆలోచించేలాగా ఉంచు. కేవలము ఇతరుల గురించి, ఇతరుల గురించే ఆలోచించేలాగా చూడు. అదే నా జీవిత పరమార్థం కావాలి. నేను నాలాగా జీవించాలి అంటే నేను ఇతరుల కోసమే జీవించే విధంగా నాకు సహాయం చేయి.”

ఇక ఇప్పుడు ఈ అధ్యాయాన్ని ముగించేముందు 1967 జనవరిలో జరిగిన ‘గోల్డెన్ జూబ్లీ సంచిక’లో జ్ఞానేశ్వరి స్వయంగా వ్రాసిన విషయాలను కూడా పొందు పరచటం చాలా అవసరం.

**నేను స్వామీజీ వద్ద నేర్చుకున్న విషయాలు - జ్ఞానేశ్వరి**

1. స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే భగవంతుడు అంటే ప్రేమ మరియు ప్రేమ అంటేనే భగవంతుడు. కనుక ఎక్కడ ప్రేమ ఉంటుందో, అక్కడ భగవంతుడు ఉంటాడు.

2. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే మతము జీవితము రెండు వేరుకాదు ఒక్కటే. కనుక నేను కళ్ళుమూసుకుని ధ్యానములో ఉన్నా లేదా కళ్ళు తెరుచుకుని ఏ పనిచేస్తున్నా భగవంతుని ఉనికిని గ్రహించగల్గుతాను.

3. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే పనిచేయటమే ఈశ్వరుడిని పూజించటము. నేను ఏ పనిచేసినా అది కేవలము భగవంతుని ఆరాధించటమే.

4. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే సమయము చాలా అమూల్యమయినది. ప్రతి క్షణము విలువైనదే. ఎవరయితే సమయాన్ని వృథా చేస్తారో వారు జీవితాన్ని వృథా చేసుకుంటున్నారు. ఏదయినా పోగొట్టుకుంటే తిరిగి సంపాదించుకోవచ్చు. కానీ విలువైన, అమూల్యమయిన సమయాన్ని మాత్రం తిరిగి పొందలేము.

5. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే సోమరితనము చాలా ప్రమాదకరమైన వ్యాధి. సోమరిపోతు తనకే కాకుండా ఇతరులకు కూడా హాని చేస్తాడు. ఎవరయితే ఏ పనీ చేయకుండా సోమరిగా ఉంటారో వారి జీవితం గడుపుతారో వారికి తినటానికి ఎలాంటి హక్కు ఉండదు.

6. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే పరిశుభ్రత దైవత్వము. ఎవరయితే బాహ్యంగానూ, ఆంతర్యంలోనూ పవిత్రంగా ఉంటారో వారే నిజమయిన దేవుని బిడ్డలు.

7. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే నిర్మలత్వము. ఆధ్యాత్మిక జీవితానికి పునాదిరాయి లాంటిది. ఆలోచనల్లో, మాటల్లో, చేతల్లో ఎవరు పవిత్రంగా ఉంటారో వారు అదృష్టవంతులు. భగవంతుని చేత ఆశీర్వదించబడతారు.

8. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే శ్వాస పీల్చినప్పుడు, శ్వాస వదలినప్పుడు ప్రతి శ్వాసలోనూ శాంతిని పొందాలి. ఇది చాలా సరళమయిన, సహజమయిన ప్రాణాయామము. ఈ శ్వాస ప్రక్రియ వల్ల నాడులన్నీ శుద్ధి అవుతాయి. మన లోపలి నరాలు కూడా పరిశుద్ధమవుతాయి. దీనివలన క్రమక్రమంగా కుండలినీ శక్తి ఉద్దీపనము భగవదనుభూతిని కలిగిస్తాయి. దీనికి ఎలాంటి రహస్యమయిన యోగప్రక్రియలు చేయాల్సిన అవసరం లేదు. అలాంటివి చాలా క్లిష్టంగా ఉండి కొన్నిసార్లు ప్రమాదకరంగా ఉంటాయి. ప్రత్యేకించి శిక్షణ పొందిన గురువు సహాయం ఉండాలి.

9. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే క్రీస్తు చెప్పిన సరళమయిన మార్గము నీ వలే నీ పొరుగువారిని కూడా ప్రేమించు. శ్రీకృష్ణభగవానుడు సూటిగా చెప్పిన మార్గము 'ప్రతి జీవిలో ఈశ్వరుడిని దర్శించు'. ప్రపంచంలోని ప్రతి ఒక్కరిలో ఆ బ్రహ్మమును దర్శించాలి. మరియు బుద్ధభగవానుడి దయాగుణము అందరినీ గౌరవించాలి, అందరిపట్లా ప్రేమ, దయ, కరుణ, సానుభూతి కల్గి ఉండాలి.



10. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే మతాలన్నీ విశ్వ సౌభ్రాతృత్వం కల్గి ఉండాలి. ప్రతి ఒక్కరిని సమానంగా గౌరవించాలి. ఆరాధించాలి. అందరూ ప్రవక్తలను, అవతారాలను, మార్గదర్శకులను, అన్ని మతాలకు చెందిన వారిని ఒకరితో ఒకరిని పోల్చకుండా, విమర్శించకుండా, వారి మతాన్ని, మత సంబంధమైన విషయాలను సమానంగా గౌరవించాలి.

11. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే "నేను ఎప్పుడూ బావిలో కప్పలాగా అజ్ఞానంతో ఉండకుండా, విశాలమయిన దృక్పథంతో, తెలివితేటలతో ఈ విశాలమయిన ప్రపంచమంతా నా సొంత ఇల్లులాగా, అందులో నివసించే వారందరూ నా సోదర, సోదరీమణులు లాగా భావించాలి. ఎలాంటి గౌరవాన్ని ఆశించకుండా ఇతరులకు సేవ చేయటం, ప్రేమించటం వలన ఆశీర్వదించబడతాము. ఇదే నా మహోన్నతమయిన మతము.

12. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే "భగవంతుని సర్వత్రా సర్వవేళల్లో దర్శించటము, ఇప్పుడు ఇక్కడ మాత్రమే కాదు, నిరంతరము ప్రతి ఒక్కరిలో, ప్రతిక్షణము తన జీవితంలో ఆ భగవంతుడిని దర్శించాలి. ఆత్మ సాక్షాత్కారానికి ఇదే అతి రహస్యమయిన మార్గము.

13. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే ఆత్మ సాక్షాత్కారము యొక్క వైభవము. బాహ్యమయిన సుఖసౌఖ్యాలు, సంపదల కోసం వెంపర్లాడకుండా, గొప్ప గొప్ప బిరుదులు, పేరు ప్రఖ్యాతుల కోసం ప్రాకులాడకుండా, నీ లోపల దివ్యంగా వెలుగుతున్న జ్యోతి స్వరూపంపైన ఆధారపడి జీవించాలి.

14. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే జీవితములో ఎదురయ్యే కష్టాలు భగవంతుడు భూమిపైన వర్షించే వర్షం లాంటివి. జీవితములో ఎదురయ్యే ఇబ్బందులు నిన్ను ఇబ్బంది పెట్టకముందే నీవు ఇబ్బందులు పడటం మొదలు పెట్టవచ్చు.

15. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే భగవంతుడిని మర్చిపోవటం మరణంతో సమానము. పరమాత్మ గురించిన అవగాహన, ఆయన యొక్క దివ్యానుభూతి శాశ్వతమయిన అమరత్వాన్ని నీ జీవితానికి కలిగిస్తుంది.

16. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే ఉపన్యాసాలు వెండి వంటివి అయితే నిశ్శబ్దము బంగారము వంటిది. మౌనము, నిశ్శబ్దము ఆభరణము వంటిది. ఆధ్యాత్మిక జీవితానికి కిరీటం వంటిది. ఎక్కువగా మాట్లాడటము వలన ఇబ్బందులు,

అపార్థాలు వస్తాయి. మౌనము వలన నిజమయిన శాంతి లభిస్తుంది. మౌనము ఆత్మలను సృష్టిస్తుంది.

17. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే ఈ ప్రాపంచిక జీవితంలో ఎదురయ్యే కష్టాలకు, పరీక్షలకు ఓర్పుతో సహనంతో వ్యవహరించాలి. అవన్నీ కూడా కదిలిపోయే మేఘాల వంటివి. కష్టాలు, పరీక్షలను తట్టుకోవటం వలన మానసికంగా ధైర్యం వస్తుంది. ఈ ప్రపంచంలో ఎవ్వరి జీవితము పూలపాన్పులాగా ఉండదు. అలాగే జీవితం ఎప్పుడూ మధురమయిన పాయసంలాగా ఉండదు.

18. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే ఆత్మ మన లోపలే ఉంది. అది సంపూర్ణమయినది. బాహ్యంలో నేర్చుకోవడానికి ఏమీ లేదు. ఒకవేళ బాహ్యంలో నేర్చుకున్నది ఒకానొకప్పుడు మర్చిపోవచ్చు. నిజమయిన శాంతి గ్రంథాలను అధ్యయనం చేసే పుస్తకాల పురుగులకు దొరకదు. ఈ ప్రపంచంలోని ద్వంద్వాలన్నింటికి అతీతమయిన స్థితికి చేరిన అరుదయిన ఆత్మజ్ఞాన స్వరూపులకు మాత్రమే నిజమయిన శాంతి దొరుకుతుంది. మహోన్నతమయిన స్థితికి చేరిన సాధుమహాత్ములు శాస్త్ర జ్ఞానము ప్రారంభ సాధకులకు మాత్రమే ఉపయోగపడుతుందని, జ్ఞానులకు అవసరముండదని చెపుతారు.

19. నేను స్వామీజీ వద్ద నేర్చుకున్నది ఏమిటంటే ఎండిపోయిన ఎముకలను నమలటము వలన నేను తృప్తి చెందను. ఇతరుల వృథా ప్రేలాపనలతో తృప్తి చెందను. ప్రపంచంలోని ఆవులన్నింటిని లెక్కపెట్టటము వలన నాకు తృప్తి కలుగదు. కొద్దిగానే అయినా తన స్వంత చిన్న ఆవు ఇచ్చే తాజాపాలు శ్రేష్ఠమయినవి. వ్యక్తిగత అనుభవము జీవితంలో ఎవ్వరికయినా ఉపయోగపడుతుంది. అలాంటి మహోన్నతమయిన స్వానుభవము పొందిన ఆత్మజ్ఞులు ధన్యులు. వారు ఈ భూమిపైన ఉప్పు లాంటివారు. వారే ఈ ప్రపంచానికి మార్గదర్శనం చేయగల్గుతారు. అసత్యం నుండి సత్యం వైపుగా, చీకటి నుండి వెలుగు వైపుగా అనిత్యం నుండి శాశ్వతత్వం వైపుగా మనలను నడిపిస్తారు. అలాంటి మహానుభావులకు అభివందనాలు.

**ఓం.... అందరికి శాంతి లభించుగాక!**

**"శాంతి బయట కాదు, మీ అంతరంగంలోనే ఉంది."**

– బుద్ధుడు (గౌతమ బుద్ధుడు)



# శాంతి ప్రార్థన

**శాంతి ప్రార్థన అంటే**

జీవభావము అంతరించి జననమరణక్లేశములను దాటి పరమ శాంతిని పొందుటకు చేయు ప్రయత్నము ఏదయితే ఉందో అదియే శాంతి ప్రార్థన.

**శాంతి అంటే ఏమిటి ?**

ఎటువంటి విషమపరిస్థితులలో అయినా మనస్సు ఏ మాత్రము కలత చెందకుండా అలజడి లేకుండా మనస్సును సౌమ్యస్థితిలో ఉంచగలగడమే శాంతి అని అంటారు.

ప్రతీ వ్యక్తి ఇంద్రియ భోగవస్తువులు, పరిస్థితులు అనుగుణంగా ఉంటే శాంతంగా ఉంటాడు. ఏమాత్రము పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా అశాంతి చెలరేగుతుంది. అలా కాకుండా ఎటువంటి పరిస్థితులలో అయినా శాంతంగా ఉండగల రహస్యాన్ని ఏ వ్యక్తి అయినా సాధించగలిగితే అతడు తన శాంతి విషయంలో బాహ్య ప్రపంచముపై ఆధారపడి ఉండడు. అంతరంగంలో సర్వ స్వతంత్రంగా శాంతిగా ఉండగలుగుతాడు.

**పరమమైన శాంతి అంటే ఏమిటి?**

ఆది శంకరాచార్యులవారు 'పరతత్వాన్ని' శాంతం=పరమశాంతం అనే పదంతో వివేకచూడామణిలో నిర్వచించారు.

శాంతి అనే పదాన్ని పరతత్త్వమని ఎలా నిర్వచించారు? అంతరంగంలో భావనాతరంగాలు నర్తించడం వలన శాంతి చెదిరిపోయి అశాంతి ప్రవేశిస్తుంది. ఆత్మతత్త్వం మనస్సునకు అతీతమైనది కావడంచేత మనస్సులోని అశాంతితో దానికి ఎటువంటి సంబంధమూ ఉండదు. అందుచేతనే ఇక్కడ పరతత్త్వం పరమశాంతం అనే పదంతో సూచించబడినది.

దివ్యమైన ఆత్మానుభవంలో అలజడికి, అశాంతికి కారణమైన రజో గుణం నశించడంతో పరమశాంతి మాత్రమే సహజంగా ఉంటుంది. ఆత్మ దర్శనంతో అన్ని అలజడులు అదృశ్యమయిపోతాయి. ఇక మిగిలి ఉండేది పరమశాంతి మాత్రమే.

## శాంతి వలన ప్రయోజనము

మనస్సు అలజడిగా, అశాంతిగా ఉంటే వ్యక్తియొక్క బుద్ధిప్రకాశం మందగించి ఉంటుంది. మనస్సు శాంతిగా నిశ్చలంగా ఉంటే బుద్ధి ప్రకాశవంతంగా సమర్థవంతంగా ఉంటుంది. మనస్సు ఎంత శాంతంగా ఉంటే బుద్ధి అంత ప్రకాశవంతంగా ఉంటుంది. అందుకే శ్రీ త్యాగరాజ స్వామివారు "శాంతము లేక సౌఖ్యము లేదు" యని కీర్తన ద్వారా తెలియపరచారు. శాంతము గల వ్యక్తి ఏ రంగములోనైనా విజయాన్ని సాధించగలడు.

శాంతి, పరమశాంతి అనే పదాలకు నిర్వచనం తెలుసుకున్నాం. శాంతి ద్వారానే పరమమైన శాంతిని (ఆత్మతత్త్వాన్ని) తెలుసుకోగలము. అందుకే స్వామీజీ వారు చాల చోట్ల "శాంతోహ్యాత్మ" అని బోర్డులు ఆశ్రమంలో పెట్టారు. ప్రతీవ్యక్తి శాంత స్వరూపుడనే భావాన్ని గుర్తు చేయడానికి పెట్టారు.

ప్రతీ వ్యక్తి పరమమైన శాంతి స్వరూపము గలవాడే! కాని తన పరమ శాంతి స్వరూపాన్ని అజ్ఞానంలో ఏ విధంగా మరచిపోయాడో, శంకరులు సూచిస్తున్నారు.

**అఖండ నిత్యాద్వయ బోధశక్త్యా**
**స్ఫురంతమాత్మాన మనంత వైభవమ్।**
**సమా వృణోత్యావృతి శక్తి రేషా**
**తమోమయీ రాహురివార్క బింబమ్॥** (వి.చూ. శ్లో 114)

తాత్పర్యం : ఆవృత్తి స్వభావం తమస్సు. ఇది రాహువు. సూర్యుని ఆవరించినట్లుగా అనంతము, అఖండము, నిత్యము, అద్వయము, అనంత శక్తియుతము అయిన ఆత్మను ఆవరిస్తోంది.

మహత్తరమైన శాంతోహ్యాత్మకు పరిణామంలేదు. ఇదినిత్యం, ఇది ఏకం, అద్వయం, మహత్తరమైన సత్యం మననుండి ఎప్పుడూ దూరంగా లేదు. ఈ చైతన్యం మనలో ఎప్పుడూ ఉన్నప్పటికీ దానిని ఆవరించిన తమో గుణ ప్రభావం వలన ఇది మనకు స్ఫురించడం లేదు. ఇంత గొప్పదయిన ఈ చైతన్యం తమస్సుచే ఏ విధంగా ఆవరింపబడింది? అజ్ఞానాన్ని ఎలా కప్పి వేయగలుగుతోంది? ప్రకృతిలోని ఒక ఉదాహరణతో రాహువు రవిని దాచినట్లుగా ఆత్మ తమస్సుచే ఆవరింపబడుతోందని ఇక్కడ శంకరులు వివరిస్తున్నారు. (రాహు రివార్క బింబం).



సూర్యగ్రహణం గురించి హిందువుల పురాణాలలో ప్రత్యేకమయిన కవితా రీతిలో వివరించబడింది. రాహువు అనే రాక్షసునికి తలమాత్రమే ఉంది. మొండెం లేదు. గ్రహణ సమయంలో ఈ రాక్షసుడు సూర్యుని మ్రింగేస్తాడు. అయితే అతనికి మొండెంలేని కారణంగా సూర్యుడు కంఠం ద్వారా బయటకు వచ్చేస్తాడు. విజ్ఞాన శాస్త్రము, కవిత్వము పాలు తేనెవలె ఇక్కడ కలసిపోయాయి.

సూర్యునికి, భూమికి మధ్యగా చంద్రుడు వచ్చినప్పుడు అది సూర్య గ్రహణం అనబడుతుంది. ఇచ్చట నిజానికి జరిగేదేమిటంటే చంద్రుడు మన దృష్టికి అడ్డుగా వచ్చి సూర్యుణ్ణి కనబడకుండా చేస్తున్నాడు. నిజానికి చంద్రుడు సూర్యుని ఎలా కప్పివేయగలుగుతాడు? సూర్యుని కంటే చంద్రుడు ఎంతో చిన్నవాడు. అందుచేత సూర్యగోళాన్ని కప్పడంలేదు. అయితే, సూర్యుడు ఎంతో దూరంగా ఉండడంచేత చంద్రుడు చాలా దగ్గరగా ఉండడంచేత, అంతే కాకుండా చూసే మనిషి ఈ రెండింటి కంటే పరిమాణంలో చాలా చిన్నగా ఉండడం వలననూ సూర్యుని చంద్రుడు దాచివేసినట్లుగా కనిపిస్తుంది.

ఏది ఏమయినా మన దృక్పథం నుండి చంద్రుడు సూర్యుణ్ణి ఆ సమయంలో అడ్డుకుంటున్నాడు. మన దృష్టితో చూస్తే సూర్యుడు పూర్తిగా కప్పబడి పోయాడు. చంద్రుని నీడనుండి కొంచెం దూరం పోయి మనం చూడగలిగితే సూర్యుణ్ణి చంద్రుడు ఏ మాత్రమూ కప్పివేయడం లేదని స్పష్టంగా గుర్తించ గలుగుతాము. చంద్రునికంటే మీదుగా ఆకాశంలోకి పోగలిగినవారికి సూర్య గ్రహణమే ఉండదు. హిందూపురాణ పరిభాషలో చంద్రుడు మనస్సుకు అధిదేవత. సర్వాన్ని ప్రకాశింపజేసే సూర్యుని ఆత్మతో పోలుస్తారు. పై ఉదాహరణను మనలో మనం సరిచూసుకుంటే నాకు నా ఆత్మకు మధ్యగా ఈ మనస్సు ఉన్నంతకాలము ఆత్మ అనే సూర్యుడు గ్రహణంలో ఉండిపోయినట్లే. నాకెన్నటికి ఆత్మతత్త్వం అర్థంకాదు. తమస్సు వలన పరమశాంతి కప్పబడుతుంది. ఈ అజ్ఞానమే (అవిద్య) నాలో మనస్సుగా వ్యక్తమౌతుంది. మనస్సును అధిగమించగలిగితే అనేకత్వం లేనేలేదు. పరమశాంతి పొందితే అన్ని బాధలు అంతరిస్తాయి.

# ఆనంద రామాయణము

(గత సంచిక తరువాయి) **పరిష్కర్త : స్వామి సత్యాత్మానంద**

## 5వ సర్గ

యతస్త్వయాఽఽంచితో విష్ణుః తత్సాన్నిధ్యం ప్రయాస్యసి ।
బహూన్యష్టసహస్రాణి భార్యాద్వయయుతస్య తే ॥ 25

తతః పుణ్యే క్షయం ప్రాప్తో యదా యాస్యసి భూతలమ్ ।
సూర్యవంశోద్భవో రాజా విఖ్యాతస్త్వం భవిష్యసి ॥ 26

నామ్నా దశరథస్తత్ర భార్యాద్వయయుతః పుమాన్ ।
తృతీయేయం తదా భార్యా పుణ్యస్యైవార్ధభాగినీ ॥ 27

కలహా కైకయీ నామ్నీ భవిష్యతి న సంశయః ।
తత్రాపి తవ సాన్నిధ్యం విష్ణుర్దాస్యతి భూతలే ॥ 28

ఆత్మానం తవ పుత్రత్వం ప్రకల్ప్యామరకార్యకృత్ ।
రామనామ్నా రావణాదీన్ హత్వా రాజ్యం కరిష్యతి ॥ 29

తవాజన్మవ్రతాదస్మాత్ విష్ణుసంతుష్టి కారణాత్ ।
న యజ్ఞా న చ దానాని న తీర్థాన్యధికాని వై ॥ 30

అతస్త్వగ్రేఽపి ధర్మజ్ఞ నిత్యం విష్ణువ్రతే స్థితః ।
త్యక్తమాత్సర్యదంభోఽ పి భవ త్వం సమదర్శనః ॥ 31

కార్తికే మాధవే మాఘే చైత్రే మాసచతుష్టయే ।
ప్రత్యబ్దం త్వం ధర్మదత్త ప్రాతఃస్నాయీ సదా భవ ॥ 32

ఏకాదశీవ్రతే తిష్ఠ తులసీవనపాలకః ।
బ్రాహ్మణానపి గాశ్చాపి వైష్ణవాంశ్చ సదా భజ ॥ 33

మసూరికాశ్చారనాలం వృంతాకాదీని ఖాద మా ।
ఏవం త్వమపి దేహాంతే తద్విష్ణోః పరమం పదమ్ ॥ 34

ప్రాప్నోషి ధర్మదత్త త్వం తద్భక్త్యైవ యథా వయమ్ ।
పుణ్యశీలసుశీలాఖ్యౌ జయశ్చ విజయస్తథా ॥ 35

ధన్యోఽసి విప్రాగ్ర్య యతస్త్వయైతద్, ।
వ్రతమ్ కృతం తుష్టికరం జగద్గురోః ।
యదర్ధభాగాత్సఫలాన్మురారేః
ప్రణీయతేఽస్మాభిరియం సలోకతామ్ ॥ 36



ముద్గలఉవాచ

ఇత్థం తౌ ధర్మదత్తం తముపదిశ్య విమానగౌ
తయా కలహయా సార్ధం వైకుంఠభువనం గతౌ ॥ 37

మొసలిగా ఉండి, ముక్తినందినట్టి యీ విజయుడను వాదును, ఇప్పుడు పుణ్యశీల, సుశీల పేర్లు కలిగియున్నాము. దేహధారులు విష్ణునామస్మరణమే శరణమై సద్గతి నిచ్చుచున్నది. నీవు పుణ్యక్షయానంతరమున దశరథుడను పేరుగల సూర్యవంశ రాజుగా అవతరించుచున్నావు. నీకిరువురు భార్యలుందురు. నీయొక్క పుణ్యార్ధ భాగినియగు ఈమె కలహయనునది, కైకేయి యను మూడవభార్యగా నుండును. ఇందులో సంశయములేదు. అప్పుడును భూమిపై నీకు శ్రీహరి సాన్నిధ్యము నిచ్చు చుండును. దేవకార్య నిర్వహణకై శ్రీవిష్ణువు 'రామ' అని పేరుగలిగిన పుత్రుడుగా జన్మించి, రావణాదులను జంపి, రాజ్యమేలును. ధర్మదత్తుడా! నీ కార్తీక విష్ణువ్రత ప్రభావమింతగానున్నది. మహానుభావా! ఏ తీర్థములును దీనికి సాటిగావు. ఏ యజ్ఞములును ఇందుకు సరిగాదు. మదమాత్సర్య దంభాదులును వదలి సమదర్శనగా ఉండుము. కార్తీకము, వైశాఖము, మాఘము, చైత్రము అను ఈ నాలుగు నెలల్లో ప్రతి వత్సరమును నీవు ప్రాతఃస్నానమును ఆచరింపుము. తులసీచెట్టును కాపాడుచు, ఏకాదశీ వ్రతమును అనుష్ఠింపుము. బ్రాహ్మణులను, గోవులను, విష్ణుభక్తులను పూజింపుము. చిరుసెనగలను, అరనాలమును, వంకాయలను తినవలదు. ఇట్లుండి మావలె నీవు దేహాంతరమున శ్రీవిష్ణు పరమ పదమును పొందుదువు గాక. విప్రవర్యా! ఏ నీ పనియొక్క వ్రతార్థఫలముచే ఈమెను విష్ణులోకమును పిలచికొనిపోదుమో అట్టి నీవే ధన్యుడవు. నీవే నారాయణవ్రతమును ఆదరించిన ధీరుడవు అని యిట్లు ఉపదేశించి, ఆ పుణ్యశీల, సుశీలలు కలహతోడ వైకుంఠమునకు వెళ్ళిరి. ధర్మదత్తుడును అట్లే ఆ వ్రతమును ఆచరించుచు, దేహాంతరమున తన సతులతోడ విష్ణులోకమునకు చేరెను.

ధర్మదత్తోఽప్యసౌ రాజన్ ప్రత్యబ్దం తద్వ్రతే స్థితః ।
దేహాంతే పరమం స్థానం భార్యాభ్యామన్వితోఽభ్యగాత్ ॥ 38

బహూన్యబ్దసహస్రాణి స్థిత్వావైకుంఠసద్మని ।
తతః పుణ్యక్షయే జాతే జాతోఽసి త్వం నృపో మహాన్ ॥ 39

త్రిభిః స్త్రీభిర్దశరథ తే విష్ణుః పుత్రతాం గతః ।
రామోఽయం లక్ష్మణశ్చైషో భరతోఽబ్జోఽరిశత్రుహా ॥ 40

ఏవం సర్వం మయాఽఽఖ్యాతం యథా పృష్టం త్వయా మమ ।
ధన్యస్త్వం యస్య తనయః సాక్షాన్నారాయణోఽ భవత్॥ 41

శ్రీశివఉవాచ

ఇత్యుక్త్వా నృపతిం పూజ్య విససర్జ మునిస్తదా ।
ఆలింగ్య రామం సౌమిత్రిం మేనే చ కృతకృత్యతామ్ ॥ 42

తదా రాజా స్వసైన్యేన మహాహర్షసమన్వితః ।
అయోధ్యామగమద్రమ్యాం గోపురాట్టాలమండితామ్ ॥ 43

నృపమాగతమాజ్ఞాయ మంత్రిణః పురవాసినః ।
పతాకతోరణాద్యైశ్చ దివ్యచందనసేచనైః ॥ 44

నగరీం భూషయిత్వా తే నృత్యవాద్యాదిమంగళైః ।
నిన్యుః కుటుంబసహితం రాజానం నగరీం ప్రతి ॥ 45

రామమాగతమాజ్ఞాయ గోపురాట్టాలపంక్తిషు ।
కట్యాం నిధాయ బాలాంశ్చ స్త్రియః స్థిత్వా నిజైః కరైః ॥ 46

సువర్ణకుసుమాద్యైశ్చ పవర్షుః పుష్పవృష్టిభిః ।
కాశ్చిన్మార్గోపరి స్థిత్వా కుంభదీపాది మంగళైః॥ 47

ఆర్తిక్యాద్యైశ్చ రాజానం సరామం శాంతికారకైః।
పూజయంతి స్మ తాః సర్వా రాజమార్గే పృథక్ పృథక్ ॥ 48

ఏవంనానాసముత్సాహైః నర్తనైర్వారయోషితామ్ ।
దుందుభీనాం నినాదైశ్చ గాయకానాం చ గాయనైః ॥ 49

సౌధోర్ధ్వగవాక్షైశ్చ స్త్రీముక్తపుష్పవృష్టిభిః ।
యయౌ స్వశిబిరం రాజా వీజ్యమానః సుచామరైః ॥ 50

తతస్తాన్ జనకామాత్యాన్ వస్త్రాలంకారవాహనైః ।
సత్కృత్య భోజనాద్యైశ్చ ప్రేషయామాస మైథిలిమ్ ॥ 51

ఏవం సర్వేషూత్సవేషు జనకో వార్షికేషు సః ।
నినాయ మిథిలాం రామమాతృభిః పార్థివేన చ ॥ 52

ఉత్తరోత్తరతః పూజ్య తోషయామాస రాఘవమ్ ।
రామోఽపి రమయామాస లీలాభిఃనృపతిం తదా ॥ 53

అనేక వేల సంవత్సరములు వైకుంఠమున ఆనందముగా గడిపి, పుణ్యక్షయము కాగా దశరథుడు అనువానిగా ఇట్లు జన్మించితివి. నీ యొక్క ముగ్గురు భార్యలు శ్రీవిష్ణుపుత్రభావము నొందిరి. ఈ రాముడే శ్రీవిష్ణువు. ఆదిశేషుడే లక్ష్మణుడు, శంఖ చక్రములే భరత శత్రుఘ్నులు. మహారాజా! మహావిష్ణువు నీ కొడుకగుటచే, నీవు ధన్యుడవు. నీవడిగిన సంగతినంతయు చెప్పితిని అని ముద్గలముని యిట్లు



భూత, భవిష్యత్ వృత్తాంతములను వివరించి, దశరథుని సత్కరించి, శ్రీరామాదులను హత్తుకుని పంపెను. పిదప దశరథ మహారాజు మహాసైన్యములతో అందరిని వెంటదీసికొని శోభాయమానమైన అయోధ్యకు చేరెను.

**శ్రీరామాదులు మరల అయోధ్యకు వచ్చిచేరుట.**

మంత్రులు వచ్చి సముచిత మర్యాదలతో నగరములోనికి స్వాగతించిరి. రామాదుల రాకను తెలుసుకుని రాజమార్గమున కాంతామణులు మిద్దెలను ఎక్కి, పసిబిడ్డలను చంకలలో నెత్తుకుని, పుష్పవర్షములను కురిపించగా, కొందరు వేడుకలను చూచుచుండిరి. కొందరు యువతులు అచ్చటచ్చట చేరి మంగళకరమగు కుంభదీపరాశులచే మంగళహారతు లెత్తి ఆరాధించుచుండిరి. ఇట్లు మహోత్సవములతోను, మంగళ వాద్య నినాదముల తోను, వారాంగనా నృత్యములతోను, గాయకుల గానములతోను, కిటికీలలో నుండి అంతఃపుర స్త్రీలు సమర్పించుచుండు పుష్పజల్లులతోను, చామరాది ఉపచారముల తోనువచ్చి వారివారి రాజమందిరములను అలంకరించిరి. అంత దశరథ మహారాజు; జనకరాజుయొక్క మంత్రులను వస్త్రాలంకారాదులతో సత్కరించి, భోజనాదులతో సంతోషపరచి మిథిలకు పంపెను, అట్లే జనక మహారాజు అన్ని ప్రముఖఉత్సవాలకును శ్రీరామాదులను మిథిలాపురికి ఆహ్వానించి, రాజమాతలను, దశరథ రాజును ఆనంద తరంగాలలో ముంచుచుండెను. ఇట్లు ఉత్తరోత్తర అభివృద్ధిగా అల్లుని సంతోష పరచుచుండెను. రాముడును లీలా వినోదములతో రారాజించుచుండెను. (53)

మాసైః షడ్భిర్ద్విజసకజా లక్ష్మీ్వ శ్రీరాఘువాచ్ఛుభా ।
లగ్నత్వేకాదశే వర్షే రజోయుక్తా బభూవ హ ॥ 54

తద్వార్తాం జనకః శ్రుత్వా పత్నీభిర్మంత్రిభిః సహ ।
అయోధ్యామగమత్ శీఘ్రం రాజా ప్రత్యుజ్జగామ తమ్ ॥ 55

పరస్పరమ్ సమాలింగ్య సాకేతమిథిలాధిపౌ ।
నృత్యవాద్యసముత్సాహైః అయోధ్యాం వివిశుః సుఖమ్ ॥ 56

తతో మహాసముత్సాహైః నానామంటపతోరణైః ।
కదలీస్తంభమాలాభిః ఇక్షుదండైః సుచామరైః ॥ 57

చతుర్ద్వారమంటపైశ్చ ఘంటాఘోషైః సదర్పణైః ।
కింకిణీజాలఘోషైశ్చ వితానైర్దీపరాజిభిః ॥ 58

వసిష్ఠో మునిభిః సార్ధం గర్భాధానవిధిం శుభమ్ ।
కారయామాస రామేణ సీతాయాశ్చాతిహర్షితః ॥ 59

తదా వస్త్రైరలంకారైః జనకో నృపతిం ముదా ।
పూజయామాస సస్త్రీకం స్నుషాపుత్రసమన్వితమ్ ॥ 60
మాసమేకమతిక్రమ్య యయౌ స్వనగరీం సుఖమ్ ।
రామో౽పి సీతయా సార్ధం నానాభోగాన్ సుపుష్కలాన్ ॥ 61
బుభుజే హేమరత్నాది నిర్మితేషు గృహేషు సః ।
రుక్మమండనయుక్తాభిః దాసీభిర్వీజితః సుఖమ్ ॥ 62

**శ్రీ సీతారామాదుల శోభనమహోత్సవము.**

పిమ్మట ఆరుమాసములకు శ్రీరామునికన్నను చిన్నదియైన సీతమ్మ పదునొకండవ యేట శుభలగ్నమున పుష్పవతియైనది. ఈ శుభవార్తనువిని జనకుడు భార్యలతోను, మంత్రులతోను పరివారముతోను మరల అయోధ్యకు వచ్చెను. దశరథుడు స్వాగతించగా, ఇరువురును పరస్పరము ఆలింగనాదులచే సంతోషించి, తన వైభవములతో రాజమందిరములచేతను, అరటిచెట్ల వరుసలచేతను, చెరుకుగడల చేతను, చామరములచేతను, రహదారి కూడళ్ళలో పందిళ్ళచేతను, ఘంటానాదముల చేతను, అద్దములచేతను, గజ్జెల చప్పుళ్ళచేతను, మంగళదీపాలచేతను అలంకృతమైన రాజమందిరమున వశిష్ఠుడు గర్భాదాన శుభమహోత్సవమును శ్రీసీతారాములకు చేయించెను. అపుడు వస్త్రాలంకారములచే జనకుడు; కొడుకు, కోడలు, ఇల్లాండ్రు తోడనున్న దశరథరాజును మిగుల సత్కరించెను. ఇట్లు సంతోషముగా ఒకనెల యిచ్చట నుండి జనకుడు మిథిలకు వెడలెను. శ్రీరాముడు సీతతో సంపూర్ణములైన వివిధ భోగములను, సువర్ణరత్నాలంకృతమగు మందిరాలలో అనుభవించుచుండెను. స్వర్ణాలంకృతలగు దాసీజనులు సేవించుచుండిరి. ఇట్లే లక్ష్మణ, భరత, శత్రుఘ్నులును వారివారి భార్యలతో సముచిత కాలములలో విధివిధానమున నిషేక శాంతి శుభకర్మ మహోత్సవములు జరిగెను.

"మనసు పవిత్రంగా ఉంటే, జీవితం కూడా పవిత్రంగా మారుతుంది."

**– శ్రీ రామకృష్ణ పరమహంస**

"మీ మీద మీకు నమ్మకం ఉంటే, ప్రపంచం మీ ముందు తలవంచుతుంది."

**– స్వామి వివేకానంద**



# హృదయస్పందన

తేది : 30/12/2025
ముక్కోటి ఏకాదశి

1. అమ్మ చీరె తెల్లన
   అమ్మ చూపు చల్లన
   అమ్మ మనసు మెత్తన
   అమ్మ నవ్వు వెన్నెల

2. అమ్మ మాట మెల్లన
   అమ్మ బాట తిన్నన
   అమ్మ తలపు తియ్యన
   అమ్మ పిలుపు కమ్మన

3. అమ్మ ప్రేమ అవ్యాజం
   అమ్మ దయ అపారం
   అమ్మ సేవ అసమానం
   అమ్మ కృషి అమోఘం

4. అమ్మ భక్తి అమాయకం
   అమ్మ శక్తి అనూహ్యం
   అమ్మ దీక్ష అచంచలం
   అమ్మ నిష్ఠ అకుంఠితం

5. అమ్మ త్యాగం అమేయం
   అమ్మ ధైర్యం అద్భుతం
   అమ్మ అమ్మ హృదయం అలౌకికం
   అమ్మ జీవనం అపూర్వం

**పూజ్య మాతాజీ శాశ్వత సన్నిధికడ**
**"జ్ఞానేశ్వరి పంచ రత్నమాల"**
**భక్తి కుసుమాంజలులతో సమర్పణం**

ఓంకార స్మరణలో... స్వామిని శీలానంద

## మాతాజీ

**నాలో నిగూఢంగా దాగిపోయిన భావాలను మేల్కొల్పింది మాతాజీయే. ఆమె పలకరింపులో ఓ జ్ఞానశక్తి ఉన్నది. ఆ శక్తి ఎందరినో వివేకవంతుల్ని చేస్తుంది. కొండలలో ఎక్కడో ఆరంభమైన జీవధార ఎన్నో విలువైన వనమూలికల దాహం తీర్చి వాటి స్వభావాన్ని అలవర్చుకున్నట్లు మాతాజీ అందరి స్వభావాల్ని అలవర్చుకున్నట్లు మాతాజీ అందరి స్వభావాల్ని అర్థం చేసుకుంటారు. ఎంతటి విచారించ తగ్గ విషయమైనా మౌనంగా దిగమింగుతూ తియ్యటి మాటలు చెపుతారు. ఆ మాటల్లో ఓ స్ఫూర్తి ఉంటుంది, జ్ఞానముంటుంది. మెదడులో అక్షరాలుగా మిగిలాయి. మన జీవితం మరొక జీవితానికి ఉపయోగపడితే ఆ జీవితం గొప్ప అందమైనదని మాతాజీ అనుబంధంతో తెలిసివచ్చింది. జీవితమంటే అనుక్షణం పోరాటమేనని ఆ పోరాటిన్ని అన్వేషించాలని, అన్వేషిస్తే... పోరాట రహస్యం తెలుస్తుందని ఆమె ప్రసంగాల ద్వారా అర్థమవుతుంది. సుతిమెత్తని మెదడు ఆలోచనలతో ఊపిరి ఆడనప్పుడు, నేనున్నానని అంటూ... ఆమె స్పర్శ ముందుకు నడిపిస్తుంది.**

**మలిశెట్టి**
**శ్రీనువాస రంగారావు (బన్ను)**

# ఏకజీవ వాదము - దృష్టి-సృష్టి వాదము

(జనవరి సంచిక తరువాయి) స్వామి బోధాత్మానంద సరస్వతి

## ప్రవచనం - 5

## అధునాతన పరిణత వేదాంత సిద్ధాంతము

**ప్రశ్న:** ఒకవేళ ఏకజీవవాదములో జీవుడు ఒక్కడే మిగతా జీవులందరూ అభాస మాత్రం అయితే, ఒక జీవుడి నుండి ఈ జగత్, జీవుల అభాసము, ఈ సృష్టి అంతా ఎలా సాధ్యమవుతుంది.

**సమాధానం:-** వాస్తవానికి చైతన్యము మరియు అవిద్యను కలిసి జీవుడు అంటున్నారు. ముఖ్య వేదాంత సిద్ధాంతములో అవిద్య కారణముగా చైతన్యము యందు ఇవన్నీ అధ్యస్తము అయ్యాయి. ఏకజీవవాదములో కూడా ప్రతీది చైతన్యము యందే అధ్యస్తమైనది. ఎందుకనగా జీవుడు వాస్తవముగా చైతన్యమే. ఆ జీవుడు జగత్ గాను, జీవ అభాసముగానూ, అనేక అంతఃకరణలుగాను వ్యక్తమవుతున్నాడు. అయినప్పటికీ ఆలోచనా విధానం వేరుగా లేదు, అధిష్ఠానం చైతన్యమే. ఆ చైతన్యము మాత్రమే సత్యం. మిథ్యా భ్రాంతికి సత్య అధిష్ఠానం అవసరం. ఈ సిద్ధాంతము ఏకజీవ వాదములో కూడా ఇదే విధంగా ఉంటుంది.

**ప్రశ్న:** రెండు జీవ అభాసములున్నాయి 1.చైత్ర 2.మైత్ర. ఒక ముఖ్యజీవుడున్నాడు, ఆ జీవుడి యొక్క కల్పననే ఈ సృష్టి. ముఖ్య జీవుడికి, జీవ అభాసమునకు తేడా ఏమిటి?

**సమాధానం:-** ముఖ్య జీవుడు కల్పకుడు (కల్పన చేసేవాడు), జీవ అభాసములు కల్ప్యములు అనగా వాటికి స్వతంత్ర సత్తా లేదు, అవి స్వతహాగా సత్తా హీనము, స్ఫురణ హీనమైనవి. చైత్ర మైత్ర అందరు కూడా వాస్తవంగా లేరు, ఉన్నట్లుగా కల్పన చేయబడ్డారు. చైత్ర సుఖ దుఃఖములు మైత్రకు తెలియదు, మైత్ర సుఖ దుఃఖములు చైత్రకు తెలియదు. కానీ ముఖ్య జీవుడైన హిరణ్యగర్భకు అందరి సుఖ దుఃఖాలు తెలుస్తాయి. అభాసజీవులు ముఖ్య జీవుడి ద్వారా ప్రకాశింపబడుతున్నాయి. ఆ జీవుడు వాస్తవానికి చైతన్యము, స్వయం ప్రకాశము, ఈ చైతన్యమునకు మరొక ప్రకాశము అవసరం లేదు. ఇదివరకు మనం చూసాము చైత్ర లేదా మైత్ర యొక్క జ్ఞానోదయమునకు ప్రాముఖ్యత లేదు. ముఖ్యజీవుడు అయిన హిరణ్యగర్భ విషయాని కొస్తే జీవన్ముక్తి, విదేహముక్తికి ప్రాముఖ్యత లేదు. జీవన్ముక్త, విదేహముక్త కంటే నిత్యముక్త, నిత్యచైతన్యము ముఖ్యమైనవి. ఒకే జీవుడు గురువు, శిష్యుడు, శాస్త్రమును కల్పన చేయగలడు, దీని ద్వారా ఉపదేశము అనేది సాధ్యమవుతుంది.



శ్రుతిని అనుసరించి ఉన్న కొన్ని ప్రశ్నలను చర్చించాలి: ఏకజీవవాదమును మరియు దృష్టి సృష్టి వాదమును ఉపనిషత్తు వాక్యాలతో ఏ విధంగా సమర్థిస్తాము?

జీవుల యొక్క నానాత్వమును గురించి చెప్పే శ్రుతులు:

1.**అవిద్యాయామంతరే వర్తమానాః స్వయం ధీరాః పండితం మన్యమానాః** (కఠ, ముండక) వర్తమానాః, మన్యమానాః ఇవి బహువచనం. అవిద్యలో అనేక జీవులు ఉన్నారు అని శృతి చెబుతోంది.

2.**య ఇహ రమణీయ చరణా రమణీయం యోనిం ఆపత్యేరన్ కపూయ చరణాః కపూయాం యోనిం ఆపత్యేరన్** (ఛా-4). ఇందులో రమణీయ చరణాః, కపూయ చరణాః ఇవి బహువచనంలో ఉన్నాయి. రమణీయ చరణాః అనగా ఎవరైతే పుణ్యకర్మ చేస్తారో వారు దేవతా యోనిని, సంస్కృత పురుషులుగా లేదా ధర్మము మోక్షము వారియొక్క ముఖ్య జీవిత లక్ష్యముగా జన్మిస్తారు. కపూయ చరణాః అనగా ఎవరైతే పాపాలు చేసి ధర్మము మోక్షము అనేవి వారి జీవితంలో లేనివారు. ఒకసారి 65సం॥లకు కలిగిన ఒక వ్యక్తి స్వామీజీ నా జీవితము యొక్క లక్ష్యము ఏమిటి అని అడిగాడు. 65 సం॥లకు పదవీ విరమణ తరువాత అతను జీవితములో ఏం చేయాలో తెలుసుకోవాలనుకుంటున్నాడు. నేను జీవిస్తున్నాను కానీ ఎందుకు జీవిస్తున్నానో కూడా తెలియకుండా జీవిస్తున్నాను. వాళ్ళంతా చాలా వ్యస్తంగా (బిజీగా) ఉన్నారు మిగతా విషయాలన్నింటిని సర్దిపెట్టడానికి, ఇలా జరగ కూడదు, వాళ్ళు అల్పమైన జీవితాలను పొందుతారు.

మొదటి దాంట్లో అవిద్యకు సంబంధించిన బహువచనం, రెండవ దానిలో కర్మకు సంబంధించిన బహువచనం.

3.**సతి సంపద్యైక విదుః సతి సంపద్యామహే సంపద్యామహే** (ఛా:6). అనేకమంది సుషుప్తిలోకి వెళుతున్నారు. అనేక మందికి కర్మ బంధనం ఉంది.

4.**వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థాః సన్న్యాసయోగాద్యతయః శుద్ధసత్త్వాః** వీరందరూ బహువచనంలో ఉన్నారు. అనేక జీవుల గురించి చర్చిస్తున్నట్లుగా ఉంది.

ఏకజీవ వాదములో ఈ శృతులన్నీ ఏ విధంగా సమంజసం అవుతాయి.

**సమాధానం:-** శృతి బహువచనంలో చెప్పినంత మాత్రమున అనేక జీవులు ఉండాలి అనే నియమం లేదు. జీవుడిని గురించి ఏకవచనంలో చెప్పే శృతులు కూడా ఉన్నాయి. అనేక జీవులు అనే సిద్ధాంతం ప్రజలద్వారా రంజింపజేయ బడుతుంది. సాంఖ్యము, యోగము, న్యాయ, వైశేషిక, పూర్వమీమాంస ఈ దర్శనాలన్నీ

ఆత్మలు అనేకం అని చెబుతున్నాయి. అందరూ ఒక్కొక్కరు ఒక్కొక్క ఆత్మ అని తప్పుడు అభిప్రాయాన్ని కలిగి ఉన్నారు. వేదాంతులు అడుగుతున్నారు ఒకవేళ ఒక ఆత్మ అనేక అంతఃకరణలతో వివరణ ఇవ్వగలిగినప్పుడు అనేక ఆత్మల అవసరం ఏముంది? ఇక్కడ కూడా ఒకజీవుడు అనేక అంతఃకరణలతో వివరించ గలిగినప్పుడు అనేక జీవుల అవసరం ఉండదు. ప్రజల ద్వారా ఏదైతే అర్థం చేసుకోబడినదో దానిని శృతులు అనువాదం చేస్తున్నాయి. ఉదా: సృష్టిని గురించి తెలియజేసే శృతులు చాలా ఉన్నందువలన వేదాంతం సృష్టిని అంగీకరిస్తుందని అనలేము. అజాతవాదం ప్రకారం వేదాంతం సృష్టిని కూడా ప్రతిషేధిస్తుంది.

**పూర్వపక్షము :–** అనేక జీవులు అవిద్య, కర్మ బంధనంలో ఉండొచ్చు. దీనిని మనం అర్థం చేసుకోగలం. కానీ ముక్తి పొందిన జీవుల సంగతి ఏమిటి? ముక్తి పొందిన తరువాత బహువచనం ఉండకూడదు. బహువచనం అనేది అజ్ఞానం ఉన్నప్పుడు ఉండవచ్చు కానీ ముక్తిపొందిన తరువాత బహువచనం ఎలా ఉంటుంది? ఉదా: **సన్న్యాసయోగాద్యతతయః శుద్ధ సత్త్వాః, వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థాః పరామృతాత్ పరిముచ్యంతి సర్వే...** వీటిలో బహువచనం అవసరం లేదు. శృతి బహువచనం ఉపయోగించింది కాబట్టి ముక్తి తరువాత అనేక జీవులు ఉన్నారని శృతి అంగీకరిస్తున్నట్లు.

**సిద్ధాంతి :–** ఈ ప్రపంచము ద్వారా జీవుల యొక్క అనేకత్వం ఏదైతే తెలుస్తుందో అది 'విధేయము కాదు. సాధారణంగా కూడా జీవుల యొక్క అనేకత్వము తెలుస్తుంది కాబట్టి శాస్త్రం ఆ విషయాన్ని తెలియజేయదు. ఒకవేళ శాస్త్రము తెలియజేసినా తరువాత ప్రతిషేధిస్తుంది. ఉదా: సృష్టిని గురించి తెలియజేస్తుంది. ఆ తరువాత ప్రతిషేధిస్తుంది. **"పరామృతాత్ పరిముచ్యంతి సర్వే"** మొదలైన శృతులు ఎవరైతే ఇది వరకు నేను బ్రహ్మ అని అర్థం చేసుకోలేదో వారు ఇప్పుడు నేను బ్రహ్మ, నేను ముక్తుడిని అని అర్థం చేసుకుంటున్నారు అని చెబుతున్నాయి. దీనినే ముక్తి అంటారు. ఇది అనేక కల్పాలలో జరగవచ్చు. ఒక కల్పంలో ఒక జీవుడికి లేదా అభాసములను తీసుకున్నట్లైతే ఏ అభాసమైనా నేను అభాసమును కాదు, నేను కల్పకుడిని అని వాస్తవమును తెలుసుకోవచ్చు.

**పూర్వపక్షము :–** సర్వజ్ఞత్వ (సర్వము తెలియడం), సర్వేశ్వరత్వ (భౌతికముగా సర్వమును శాసించడం), సర్వాంతర్యామిత్వ (అందరి అంతఃకరణలో ఉంటూ శాసించడం) మొదలైనవాటిని శృతిమాత వివరిస్తోంది. ముఖ్య వేదాంత సిద్ధాంతం ప్రకారం ఇది కేవలం ఈశ్వరుడికి మాత్రమే వర్తిస్తుంది. ఏకజీవ వాదములో జీవుడికంటే ఈశ్వరుడు వేరుగా లేడు. ఏకజీవ వాదములో మహావాక్య విచారమునకు



త్వంపదము మరియు తత్పదము రెండూ వేరుగా విచారణ చేయలేదు. త్వంపదము తత్పదము రెండూ వేరుగా విచారణ చేయలేదు. త్వంపదము తత్పదము రెండూ వేరు కాదు, రెండూ ఒకటే. ఇటువంటి సందర్భములో ఏకజీవవాదములో సర్వజ్ఞత్వము, సర్వేశ్వరత్వము, సర్యాంతర్యామిత్వమును ఏ విధంగా వివరిస్తారు?

**సిద్ధాంతి :–** చైతన్యము అవిద్యా ఉపాధి లేదా ఏకజీవుడే సర్వజ్ఞుడు. సర్వజ్ఞత్వము, సర్వకర్తృత్వము అన్నీ ఉన్నాయి. అభాసములు లేవు, కానీ ముఖ్య సిద్ధాంతములో ఈశ్వరుడి లక్షణాలను ఏవైతే చూపించారో ఆ లక్షణాలన్నీ ఏకజీవ వాదములో ఉన్నాయి. ఈ జీవుడు వాస్తవముగా బ్రహ్మ, కావున బ్రహ్మ మాత్రమే అవిద్యకు ఆశ్రయము జీవుడు కాదు. ఎవరికైతే సమిష్టి అభిమానం ఉందో వారికి సర్వజ్ఞత్వం, సర్వకర్తృత్వం ఉంటాయి. ఏ శ్లోకాలనైతే ఈశ్వరుడి కోసం ఉపయోగించారో భగవంతుడు అర్జునుడికి చెబుతున్నాడు

**"అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్।**
**ప్రకృతి స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మ మాయయా॥"**
**"బహూని మే వ్యతీతాని జన్మాని తవచార్జున।**
**తాన్యహం వేద సర్వాణి నత్వం వేత్థ పరంతప ॥"**

ఏకజీవాదములో ఈ వాక్యాలన్నీ సమర్థించవచ్చు. మీ అందరి పూర్వజన్మలు, పూర్వకర్మలు మీకు తెలియదు, నాకు తెలుసు. దీనిని ఒకే కల్పములో వివరించవచ్చు.

**పూర్వపక్షము :–** గాంధార పురుషుడిని నయన బంధనం చేసి అపహరించారు. గురువు యొక్క సూచనలతో తిరిగి వచ్చాడు. "ఆచార్యవాన్ పురుషో వేద" ఎవరైతే గురువును కలిగి ఉంటారో వారు ఈ సంసారం నుండి బయట పడతారు అని శృతిమాతచెబుతోంది. గురూపదేశం లేకుండా సాక్షాత్కారమనేది సాధ్యం కాదు. కానీ ఏకజీవవాదములో ఈ ఏకజీవుడికంటే వేరుగా మరొక జీవుడు లేడు కాబట్టి ఉపదేశము సాధ్యము కాదు. ఈ ఏకజీవుడు అయితే గురువుగానైనా ఉండాలి లేదంటే శిష్యుడిగానైనా ఉండాలి. గురువు ఎక్కడ నుండి వస్తాడు?

**సిద్ధాంతి :–** స్వప్నంలో స్వప్న గురువు, స్వప్న శిష్యుడు స్వప్న ఉపదేశం ఉన్నాయి. అవిద్యా కారణంగా ఏదైనా జరగవచ్చు. అదే విధంగా ఏకజీవ వాదములో కల్పిత గురువు, కల్పిత శాస్త్రం ఉండవచ్చు. ఉపదేశము సాధ్యమవుతుంది. నేను శిష్యుడిని (ఏక జీవుడిని), కల్పిత గురువు (అవిద్యక గురువు" అనగా అవిద్య ద్వారా గురువు కల్పించబడ్డాడు అంతేకానీ గురువు అవిద్యను కలిగి ఉన్నాడు అని అర్థం కాదు) ఆ గురువు బోధిస్తాడు.

# సర్వ వేదాంత సిద్ధాంత సారసంగ్రహం

॥ఓం॥

**శ్రీమత్పూజ్యభగవత్పాదశఙ్కరాచార్యవిచరితః**

**శఙ్కరప్రసాదినీ టీకా సహితః (పూజ్యశ్రీ బోధాత్మానంద సరస్వతి స్వామి)**

## సాధనచతుష్టయమ్

### నిత్యానిత్యవస్తువివేకః

**అధునా షడ్భిః శ్లోకైర్వివేకో వర్ణ్యతే :**

సర్వస్యానిత్యత్వే సావయవత్వేన సర్వతః సిద్ధే ।
వైకుణ్ఠాదిషు నిత్యత్వమతిర్భ్రమ ఏవ మూఢబుద్ధీనామ్ ॥21॥

అవయవాలు కలిగినది ఏదైనా అంతటా అనిత్యమే అని సిద్ధించబడిన తరువాత మూఢబుద్ధి కలిగినవారు వైకుంఠము మొదలైన లోకాలు నిత్యమని భావించడం కేవలం భ్రాంతి మాత్రమే.

**సర్వస్య సావయవత్వేనానిత్యత్వం సర్వతః సిద్ధమ్। సర్వస్యానిత్యత్వే సిద్ధే, చతుర్దశ భువనాన్యప్యనిత్యాని। "ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీన్నాన్యత్కిఞ్చన మిషత్। స ఈక్షత లోకాన్ను సృజా ఇతి।" యత్కృతకం తదనిత్యమితి న్యాయాత్సర్వే లోకా లోకపాలా అనిత్యాః। తస్మాద్వైకుణ్ఠాదీనామప్యనిత్యత్వమ్। యేషా తు వైకుణ్ఠాదిషు లోకేషు నిత్యత్వమతిస్తత్తేషాం మూఢబుద్ధీనామ వివేకినాం భ్రమ ఏవేత్యర్థః।**

అవయవాలు కలిగి ఉన్నందున సర్వప్రపంచము అనిత్యమని ప్రతిపాదితము. సర్వము అనిత్యము, పధ్నాలుగు లోకాలు కూడా అనిత్యము. "సృష్టికి ముందు నిశ్చయముగా ఆత్మ మాత్రమే ఉండెను. ఇతరము ఏదీ కదలకుండెను. ఆ ఆత్మ లోకములను సృష్టించెదనని ఆలోచించెను.... ఆ ఆత్మ లోకములను, లోకాలను పాలించేవారిని సృష్టించెదనని ఆలోచించెను. (ఐ.ఉ:1.1.3). ఏదైతే ఉత్పత్తి చేయబడినదో అది అనిత్యం అనే యుక్తితో సర్వలోకాలు లోకాలను పాలించేవారు అనిత్యం. అందువలన వైకుంఠము మొదలైన లోకాలు కూడా అనిత్యం. ఎవరైతే వైకుంఠాది లోకాలలో నిత్యత్వబుద్ధిని కలిగిఉంటారో వారు మూఢబుద్ధిగలవారు లేదా అవివేకులు. ఇది కేవలం వారియొక్క భ్రాంతి మాత్రమే.

**అత్ర వివేకం నిగమయత్యనత్యత్వమితి–**

తరువాతి శ్లోకంతో వివేకము యొక్క వివరణను ముగిస్తున్నారు.

**అనిత్యత్వం చ నిత్యత్వమేవం యచ్ఛ్రుతియుక్తిభిః।**
**వివేచనం నిత్యానిత్యవివేక ఇతి కథ్యతే ॥22॥**



శృతి మరియు యుక్తి ద్వారా ఏది నిత్యము మరియు ఏది అనిత్యము అనే విచారణ చేయడమే నిత్యానిత్య వివేకము అని తెలియజేస్తున్నారు.

**ఏవమాత్మనో నిత్యత్వమనాత్మనోఽ నిత్యత్వం చ శ్రుతియుక్తిభిర్వేదాన్తప్రమాణై స్తన్మతైస్తర్కైర్విచారణీయమ్। "శ్రుతిమతస్తర్కోఽనుసన్ధీయతామ్", "అనన్యప్రోక్తే గతిరత్ర నాస్త్యణీయాన్హ్యతర్క్యమణుప్రమాణాత్", "నైషా తర్కేణ మతిరాపనేయా", ఇత్యాద్యుక్తత్వాదాత్మనోఽతర్క్యత్వాన్న కేవలేన తర్కేణాత్మ విషయా మతిరాపనేయా। తస్మాచ్ఛ్రుతియుక్తిభిర్యద్వివేచనం విచారః క్రియతే తన్నిత్యానిత్యవివేక ఇతి కథ్యత ఇత్యర్థః।**

ఈ ప్రకారంగా ఆత్మయందు నిత్యత్వమును మరియు అనాత్మయందు అనిత్యత్వమును శృతి అనగా వేదాంత వాక్యముల ద్వారా యుక్తి అనగా తర్కము ద్వారా విచారణ చేయాలి. "తర్కము అనేది శృతిని అనుసరించి ఉండాలి" (సాధనా పంచకం–3), "ఆత్మను తనకంటే అన్యంగా చూడని వారిచే బోధించబడినప్పుడు ఉన్నదా? లేదా? అనే సందేహము ఉండదు. ఈ ఆత్మ సూక్ష్మాతి సూక్ష్మమైన విషయం తర్కానికి అందదు" (క.ఉ. 12.8). "ఈ జ్ఞానం తర్కముచే పొందదగినది కాదు" (క.ఉ :1.2.9) ఆత్మను తర్కము తెలియజేయలేదు, కేవలం తర్కము ద్వారా ఆత్మను పొందలేము/తెలుసుకోలేము అందువలన శృతి యుక్తి ద్వారా ఏ విచారణ చేస్తారో దానిని నిత్యానిత్యవివేకము అన్నారు.

### వైరాగ్యం

**అధునా ద్విసప్తతిశ్లోకైర్వైరాగ్యం నిరూప్యతే। ఐహికేతి –**

ఇప్పుడు 72 శ్లోకాలలో వైరాగ్యమును నిరూపిస్తున్నారు. ఐహిక

**ఐహికాముష్మికార్థేషు హ్యనిత్యత్వేన నిశ్చయాత్ ।**
**నైఃస్పృహ్యం తుచ్ఛబుద్ధిర్యత్తద్వైరాగ్యమితీర్యతే ॥23॥**

ఈ లోకంలో ఉన్న విషయాలు పరలోకంలో ఉన్న విషయాలు అనిత్యమని నిశ్చయముగా తెలుసుకున్నందువలన వాటియందు ఆకర్షణ తొలగిపోవడం, మహత్వ బుద్ధి లేకపోవడమే వైరాగ్యముగా వివరించారు.

**(సశేషం)**

"శ్రద్ధ మరియు సబూరి – ఇవే నిజమైన భక్తి మార్గం."

**– సాయి బాబా**

"మీరు ప్రపంచంలో చూడాలనుకునే మార్పు మీరు ముందుగా అవ్వాలి."

**మహాత్మా గాంధీ**

## వార్తలు

## కార్యక్రమములు

పరమపూజ్య జ్ఞానేశ్వరీ మాతాజీవారు బ్రహ్మలీనులైన విషయం భక్తులందరికీ విదితమే, **ది. 26-12-2025** నుండి **10-01-2026** షోడశీ వరకు కార్యక్రమ వివరములు.

ది. **26-12-2025**వ తేదీన ప్రణవాశ్రమం సుమిత్రానంద వారి ఆధ్వర్యములో అఖండనామ సంకీర్తన, ప్రణవనామ జపం చేయబడెను. చిన్మయమిషన్ సాధువులు, శ్రీ స్కందదేశికాశ్రమం ఎరుకంపాలెం రామానంద స్వామివారు, లక్ష్మణానంద స్వామి వారు మరియు హిమాలయ సాధువుల ద్వారా ప్రస్థానత్రయము, విష్ణుసహస్రనామ పారాయణం చేయబడెను.

శాంతి ఆశ్రమ ఉత్తరాధికారిణి స్వామిని వినమ్రానంద గారు మరియు పూజ్య జ్ఞానేశ్వరి మాతాజీ వారి శిష్యురాలు స్వామిని శారదానంద గారి కలిసి పరమపూజ్య బ్రహ్మలీన జ్ఞానేశ్వరి మాతాజీ వారికి అంత్యేష్టి కర్మను నిర్వహించారు. ఈ చివరి మహాప్రస్థానం తిలకించడానికి వందలాది ఆధ్యాత్మిక జిజ్ఞాసువులు, భక్తులు, వివిధ ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు ఎంతో భక్తితో శోక సంతప్త హృదయాలతో పాల్గొన్నారు

శరభవరము, పిఠాపురం, అన్నవరం దేవస్థాన పండితులచే **ది. 26-12-2025** నుండి **09-01-2026** వరకు వేదపారాయణం జరుపబడినది. మరియు 6వ తేదీన శతరుద్రీయం జరుపబడినది.

**ది.31-12-2025 మంగళవారము :** ఉ॥6.00ల నుండి సా॥ 6.00 గం.ల వరకు విష్ణు సహస్రనామ పారాయణం జరిగినది.

సా॥6.00 గం.ల నుండి 7.00 గం.లవరకు సత్సంగము, ధ్యానము జరుపబడినది.

**ది.31-12-2025 బుధవారము :** ఉ॥6.00 గం.ల నుండి సా॥ 6.00 గం.లవరకు ప్రణవ ధ్యానము జరుపబడినది.

**ది.01-01-2026 గురువారము :** ఉ॥6.00 గం.ల నుండి సా॥ 6.00 గం.లవరకు జయజయ రామకృష్ణ హరిఃఓం నామజపం జరుపబడినది.

సా॥6.00 గం.ల నుండి 7.00 గం.ల వరకు సత్సంగము, ధ్యానము జరుప బడినది.

**ది.02-01-2026 శుక్రవారము :** ఉ॥6.00 గం.ల నుండి సా॥ 6.00 గం.లవరకు ప్రణవ ధ్యానము జరుపబడినది.

సా॥6.00 గం.ల నుండి 7.00 గం.ల వరకు సత్సంగము, ధ్యానము జరుప బడినది.
జనవరి 5, 2026వ తేదీన బ్రహ్మకుమారి వారికి జ్ఞాపికలను ప్రదానం చేశారు.
నారాయణ హోమం, శతరుద్రీయం, సప్తశతీ నిర్వహించబడెను.

**ది.09-01-2026 శుక్రవారము :** ఉ॥6.00 గం.ల నుండి సా॥ 6.00 గం.లవరకు శాంతి ప్రార్థన జరుపబడినది.

సా॥6.00 గం.ల నుండి 7.00 గం.ల వరకు సత్సంగము, ధ్యానము జరుపబడినది.



16వ రోజున అనగా జనవరి 10, 2026వ తేదీన పూజ్య శ్రీ పద్మనాభానంద స్వామి వారిచే పూజ్యశ్రీ ఓంకార స్వామీజీ వారికి పాదుకాపూజ చేయబడినది. తదుపరి ఆ ప్రేమైకమూర్తి, శాంతిస్వరూపిణి, షోడశకళా రూపిణి అయిన జ్ఞానేశ్వరి మాతాజీ వారి సంస్మరణలో భాగంగా 16 మంది సాధు మహాత్ములకు షోడశీ పూజా కార్యక్రమం శ్రీ శాంతి ఆశ్రమంలోని నిర్వాణమందిరముయందు నిర్వహించ బడినది. అదేరోజు కార్యక్రమానికి విచ్చేసిన మహాత్ములు జ్ఞానేశ్వరి మాతాజీ వారితో వారికున్న అనుబంధం మరియు వారి అనుభవాలను ప్రవచనముల ద్వారా భక్తులందరికీ తన్మయత్వముతో తెలియజేశారు. చివరిగా విశ్వశాంతిని కాంక్షిస్తూ అందరిచేత శాంతి ప్రార్థనను చేయించారు. అన్నదానము మరియు వస్త్రదానము చేయబడింది.

**కృతజ్ఞత:** ఈ కార్యక్రమమును ముందుండి నడిపించిన పూజ్యశ్రీ స్వామి పద్మనాభానంద గిరికి (దివ్యజీవన సంఘం), మరియు కార్యక్రమానికి విచ్చేసి సహకారమును అందించిన పూజ్యశ్రీ స్వామి ముక్తానంద గారికి మరియు షోడశికి విచ్చేసిన మహాత్ములందరికీ మా హృదయ పూర్వక ధన్యవాదములు.

దివ్యజీవన సంఘం-ఋషీకేశ్, దివ్య జీవన సంఘం సౌత్ ఆఫ్రికా, ఆనందాశ్రమం, రమణాశ్రమం, యోగా కాన్షియస్ ట్రస్ట్, చిన్మయ మిషన్, ప్రణవాశ్రమం, సత్యసాయి భక్తులు, మిగతా అన్ని ఆశ్రమలు, ఆశ్రమ కమిటీ, ఆశ్రమ భక్తులు, విద్యుత్ శాఖ, రక్షణశాఖ, ప్రసార మాధ్యమం, వివిధ విభాగాల సరఫరాదారులు, భజనబృందాలు, పండితులు, అంకిత భావముతో పనిచేసిన వారందరుకి, వైద్యాధికారులు మరియు వారి బృందం ప్రత్యేకించి పి.హెచ్.సి. తోటపల్లి వారందరికీ మా హృదయ పూర్వక ధన్యవాదములు.

**20.1.26 (మంగళవారం)** సా. 5 గం.లకు పూజ్యశ్రీ పద్మనాభానంద స్వామి (శివానందాశ్రమం) వారిచే ప్రణవ పతాకావిష్కరణ జరుపబడినది. తరువాత స్వామీజీ ప్రసంగించారు. అటుపిమ్మట పూజ్యశ్రీ స్వామిని సవిత్రానంద గారు ప్రసంగించారు.

**21.1.26 (బుధవారం)** పూజ్య శ్రీ ఓంకార స్వామివారి 132వ జన్మదినం సందర్భంగా ఓంకార మందిరంలో కార్యక్రమాలు నిర్వహించబడినవి.

**21.1.26 (బుధవారం)** ఉ. 7.30 గం. లకు పూజ్యశ్రీ పద్మనాభానంద స్వామీజీ వారు పూజ్యశ్రీ ఓంకారస్వామి వారి విగ్రహమునకు పుష్పమాలను సమర్పించారు. పూజ్యశ్రీ రమణానంద స్వామి (రాచపల్లి) వారు దీప ప్రజ్వలనం చేసారు తరువాత పూజ్యశ్రీ పద్మనాభానంద స్వామి వారిచే పూజ్యశ్రీ ఇంకారస్వామి వారి పాదుకా పూజ జరిగినది. శ్రీ ఓంకార స్వామివారి జన్మదిన సందేశమును పూజ్యశ్రీ వినమ్రానంద మాతాజీ వినిపించారు.

## విరాళములు

| | | |
|---|---|---|
| 1. | శ్రీ కొమరగిరి వెంకటరామారావు గారు (రాజమండ్రి) | 10,000/- |
| 2. | పూజ్యశ్రీ స్వామి రమణభగవాన్ గారు (అరుణాచలం) | 5,000/- |
| 3. | శ్రీ రాపాక సుబ్రహ్మణ్యం గారు (రామచంద్రపురం) వీరి మేనత్తగారు లేటు శ్రీమతి కొర్లేపర సత్యవతిగారి జ్ఞాపకార్థం | 10,000/- |
| 4. | శ్రీ జి.ఎమ్.వి. రమణగారు (ఢిల్లీ) | 10,000/- |
| 5. | శ్రీ పైడా వెకంట నారాయణగారు కళ్యాణిగారు, స్వర్ణగారు కిషోర్‌గారు, శ్రేయాష్‌గారు, ఉదయ్‌గారు, మహేష్‌గారు (కాకినాడ) | 12,000/- |
| 6. | శ్రీ పైడా శ్రీరామకృష్ణయ్యగారు (కాకినాడ) | 10,000/- |
| 7. | శ్రీ కె.ఈశ్వరరాజు గారు | 10,000/- |
| 8. | శ్రీ కె.ఎమ్.ఎమ్. కృష్ణరాజు గారు | 10,000/- |
| 9. | శ్రీమతి వేల్పూరి సీతాదేవి గారు (విశాఖపట్నం) | 1,00,000/- |
| 10. | శ్రీ మురాల అరుణరాజు గారు (కాకినాడ) | 5,001/- |
| 11. | శ్రీ ఎన వపన్‌కుమార్ రెడ్డి గారు (హైదరాబాదు) | 5,000/- |

## శాశ్వత అన్నదానం

| | | |
|---|---|---|
| 1. | శ్రీ కందక మల్లేశ్వర్రావు & అనంతలక్ష్మిగార్లు (రాజమండ్రి) వీరి మావయ్యగారు శ్రీ నూలు, సత్యనారాయణగారి జ్ఞాపకార్థం | 10,000/- |


| | |
|---|---|
| **1. మాతృ ఆశ్రమం**<br>శ్రీ శాంతి ఆశ్రమము<br>తోటపల్లి కొండలు,పిన్ : 533 446<br>వయా శంఖవరం, కాకినాడ జిల్లా<br>సెల్ :7382009962<br>రిసెప్షెన్ : 7815890094<br>e-mail : srisanthiashram@gmail.com | **4. కోటగిరి శాఖ**<br>పీస్ సెంటర్, డార్మోనా రోడ్,<br>కోటగిరి-643217, నీలగిరిజిల్లా,<br>తమిళనాడు,<br>ఫోన్ : 04266- 271945<br>e-mail: vsvmsktg@yahoo.com<br>vsvmsktg@gmail.com |
| **2. విశాఖ : శాంతి ఆశ్రమము**<br>లాసన్స్‌బే, పెదవాల్తేరు-530 017<br>విశాఖపట్నం<br>ఫోన్ : 0891 - 2538689<br>e-mail : srisanthiashramvsp@gmail.com | **5. కాకినాడ శాఖ**<br>శాంతి ఆశ్రమము,అశోక్ నగర్<br>కాకినాడ - 533 004<br>కాకినాడ జిల్లా |
| **3. విశ్వశాంతి క్షేత్రం**<br>కైలాసగిరి<br>విశాఖపట్నం | **6. పిఠాపురం శాఖ**<br>స్టువర్టు పేట,పిఠాపురం-533 450<br>కాకినాడ జిల్లా |

Website : www.srisantiashram.org




## దాతలకు విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులకు సూచన. శ్రీ శాంతి ఆశ్రమమునకు విరాళము ధన రూపంలో / చెక్కు / ఎస్.బి.ఐ. కత్తిపూడి, అకౌంట్ నెం. 11003309435 కు IFSC Code : SBIN0014774 ఆన్‌లైన్ ద్వారా పంపగలరు. మీ విరాళములకు ఇన్‌కమ్‌ట్యాక్స్ 80జి రాయితీ కలదు. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకంగా లేదా ఇమెయిల్ ద్వారా మొబైల్ నంబరు 7382009962 మరియు రిసెప్షన్ నెంబరు 7815890094కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు.

## శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

శాంతి పత్రిక ప్రతినెలా 5వ తేదీన పోస్టు చేయబడును.

సంII చందా రూ. 100/-, జీవిత చందా రూ. 1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే), ఎమ్.ఓ/స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కత్తిపూడి అకౌంట్ నెం. 11003309435, ఆన్‌లైన్ ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

ఎమ్.ఓ.ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.

చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను. మీ అడ్రస్ మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి. చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమచేయబడును.

కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)
వయా శంఖవరం - 533 446, తూ.గో.జిల్లా

## విన్నపము

విదేశములలో వుండు ఆశ్రమ భక్తులు విరాళములు ఈ క్రింది ఎఫ్.సి.ఆర్.ఎ (Foreign Contributions Regulation Act) బ్యాంక్ అకౌంట్‌కు తమ నివాస ప్రాంతములోని తమ బ్యాంక్ అకౌంట్ నుండి ఆ దేశ కరెన్సీలో పంపగలరు. పంపిన పిదప వివరములు srisanthiashram@gmail.com అనే మెయిల్ ఐడికి మరియు Secretary S.Bheemeswara Rao, sbraodean @gmail.com తప్పకుండా పంపవలెను.

బ్యాంకు పేరు : State Bank of India, 11 Sansad Marg, New Delhi -110001
A/c Name : The Mission of peace - FCRA A/c No : 40127798428
Swift Code : SBININBB104

This Periodical is Registered with Registar of Newspapers, New Delhi Vide R.No. 3447/57,
Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2024-2026

## SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS

| | | |
|---|---|---|
| 1. Auto Biography of swami Omkar (2 Volumes) | Rs. | 150/- |
| 2. Life and Teachings of Swami Omkar | Rs. | 10/- |
| 3. Soham | Rs. | 10/- |
| 4. Cosmic Fast | Rs. | 20/- |
| 5. Meditation | Rs. | 10/- |
| 6. Om Japa | Rs. | 10/- |
| 7. Control of Mind | Rs. | 30/- |
| 8. Cosmic Flashes | Rs. | 10/- |
| 9. In the Hours of Silence | Rs. | 10/- |
| 10. The Soul of Omkar | Rs. | 10/- |
| 11. How I learned English | Rs. | 10/- |
| 12. Reincarnation of my Little Sister | Rs. | 10/- |
| 13. God Realization Now and Here | Rs. | 10/- |
| 14. Mystic Prayers and Poems | Rs. | 20/- |
| 15. The Divine Voice of Omkar | Rs. | 40/- |
| 16. Auto Biography of Omkar (Revised Edition) | Rs. | 100/- |
| 17. Petals of Peace | Rs. | 20/- |
| 18. The Story of my life and Work | Rs. | 10/- |
| 19. Priceless legacy of Swami Omkar | Rs. | 10/- |
| 20. The Four Initiations | Rs. | 10/- |
| 21. Musings | Rs. | 20/- |
| 22. Peace Prayer | Rs. | 20/- |

**THE MISSION OF PEACE**
**శ్రీ శాంతి ఆశ్రమము**
పోస్టు: శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446
కాకినాడ జిల్లా, (ఆం.ప్ర.)
ఫోన్ : 7382009962
email: srisanthiashram@gmail.com
www: www.srisantiashram.org

Book Post

______________________________

______________________________

______________________________

Published by MVV Satyanarayana on behalf of The Mission of Peace - Sri Santi Ashram and printed at Mohan Graphics, Kakinada - 533 001. Ph:0884-2361419 and Published at Thotapalli Hills-533 446, Ph: 73820 09962 Editor : Swamini Vinamrananda